# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సత్కారం



కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌ని జిల్లా బిజెవైఎం అధ్యక్షులు దినేష్ మంగళవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రి వర్గంలో బండి సంజయ్‌కి చోటు దక్కడం సంతోషంగా ఉందని దినేష్ తెలిపారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


# పెంచిన ధరలు తగ్గించాలి

**ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అశలత**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని..మహిళలకు భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అశలత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం సింగిరెడ్డి నవీన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన అరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని అనేక చోట్ల అత్యాచారాలు జరుగుతుంటే వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అత్తిని శారద, జిల్లా కమిటీ సభ్యులు శోభ, శిరీష, మానస, శోభ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్ అవిష్కరిస్తున్న మంత్రి

# జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

**రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో ఈ మేళా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న జాబ్‌మేళాలో నియోజకవర్గంలోని దాదాపు 5వేల మంది యువకులకు ఉపాధి కల్పించనున్నట్లు సూచించారు. నిరుద్యోగ యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో డిసిసి మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, సీనియర్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

**కుటుంబ సమేతంగా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి...**

దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ది గాంచిన హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ తల్లిని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బోనం సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతరకు వచ్చిన భక్తులతో మంత్రి ముచ్చటించారు. అందరితో కరచలనం చేస్తూ సందడి చేశారు. జాతరకు వచ్చిన పిల్లల్ని ఎత్తుకుని బుజ్జగించారు.

**నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని**

# విజయవంతం చేయాలి

**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్**




మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 18 ప్రభాతవార్త:** జిల్లాలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్, డిస్ట్రిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, వివిధ మండలాల వైద్యాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లాలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జూన్ 20వ తేదీన అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, జూనియర్ కాలేజీల్లో, మదర్సాలు, పాలిటెక్నికల్ కళాశాలలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు మొదలగు అన్ని విద్యాసంస్థల్లో అల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 1-19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత పిల్లలందరికీ మాత్రలు వేయాలని, 1-2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2-3 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర, 3-19 సంవత్సరాల పిల్లలందరికీ ఒక మాత్ర నలిమి చప్పరించాలని తెలిపారు. జూన్ 27, 2024 రోజున మిగిలిపోయిన పిల్లలందరికీ ఎమ్‌వోపీ-యూపీ రౌండ్ రోజున ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌లు డాక్టర్ మాధురి, డాక్టర్ విజయనిర్మల, ~~డాక్టర్~~ అనిలా, డాక్టర్ నవీన్, సహా జిల్లా మలేరియా అధికారి విజయేందర్, డీపీహెచ్‌ఎన్‌వో లిల్లీగ్రేస్ పాల్గొన్నారు.

**వార్త ప్రభావం**

# ఆక్రమణకు గురైన శిఖం భూములను పరిశీలించిన అధికారులు

**హత్నూర, జూన్ 18 ప్రభాతవార్త:** వార్త దినపత్రికలో ఈనెల 17వతేదీన ప్రచురితమైన శిఖం భూములు కబ్జాకు గురవుతున్న పట్టించుకోని అధికారులు అనే శీర్షికతో వార్త దినపత్రికలో కథనం ప్రచురితం జరిగిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన ఇరిగేషన్ డిప్యూటీ ఇఈ రవికుమార్, ఎఈ. వైష్ణవిలు మంగళవారం హత్నూర మడల పరిధిలోని హత్నూర, బ్రాహ్మణగుడేం, గ్రామాల పరిధిలోని అయ్యవారి చెరువు, పాలమ్ చెరువు, నక్కల కుంట, గుర్‌మాస్‌కుంట, గుంటలలోని శిఖం భూములను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్‌న పరిధిలో అక్రమించి చదును చేసిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎ.ఇ. వైష్ణవి మాట్లాడుతూ హత్నూర బ్రాహ్మణ గుడేం గ్రామాలలో అక్రమణకు గురైన కుంటల శిఖంలను సర్వే చేయాలని హత్నూర తహాశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చామని అన్నారు. తదపరి చర్యల కొరకు పై అధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. డీఈ., ఎ.ఈలతో పాటు పంచాయతీ కార్యదర్శి రఘువీర్, లాస్కర్ రవి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.



ఆక్రమణకు గురైన శిఖం భూమిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

# చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



సఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సంగారెడ్డి టౌన్, జూన్ 18, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని బాలసదనం శిశు గృహ, సఖీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం సందర్శించారు. బాలసదనంలో కొత్తగా నిర్మాణం పనుల వివరాలను జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, డిసిపిఓ రత్నం, ఏఈలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని విద్యార్థులను అందుతున్న సేవల గురించి కలెక్టర్ అడగి తెలుసున్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను ఆర్జించి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. మహిళా ప్రాంగణంలోని శిశు గృహాన్ని సందర్శించి చిన్నారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు దత్తతకు తొందరగా వెళ్లేలా చూడాలని, 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడి కేంద్రాలకు పంపాలని, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. సఖీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రానికి వచ్చే మహిళలకు ఆడపిల్లలు ఎలాంటి సేవలు అందిస్తున్నారో ప్రత్యేకంగా పరిశీలించారు. 181కు వచ్చ కాల్స్‌కు వెంటనే స్పందించి వారికి అన్ని వధాల సేవలు అందించాలని తెలిపారు. మహిళా ప్రాంగణంలో నిర్మాణ జరుగుతున్న బాలరక్ష భవనం, వృద్దుల ఆశ్రమం భవనాల నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి అయ్యేలా చూడాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.

# ఇరు వర్గాలకు జరిగిన గొడవలు అదుపులోకి...

**మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి**

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 18 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలో ఇరువర్గాలకు జరిగిన గొడవలు అదుపులోకి వచ్చాయని, గొడవలకు కారణమైన ఒక వర్గానికి చెందిన 16 మందిని, మరోవర్గానికి చెందిన 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ రెండువర్గాల మధ్య జరిగిన గొడవల కారణంగా ఇతర జిల్లాల నుంచి పోలీస్ ఫోర్స్ తెప్పించి అంతా అదుపులోకి తెచ్చినట్టు తెలిపారు. సోషల్ మీడియా వేదిక అనగా వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ మొదలైన వాటి ద్వారా వచ్చే ఎలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని సూచించారు.

ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా సోషల్ మీడియాలో కానీ మరే ఇతర రకంగా గొడవలు పెట్టాలనుకుంటే వారిపై చట్ట పరమైన చర్యలు ఉం టాయని, సోషల్ మీడియాపై నిఘా నడుస్తుందని, గొడవలకు కారణమైన ఎవరిని వదలమని హెచ్చరిం చారు. సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు పెట్టవద్దని, అలా కాదని ఎవరైనా తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిని జిల్లా పోలీసులు నిరంతరం గమనిస్తారని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కేసులుపెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అవసనర పోస్టులు, కామెంట్స్, సోషల్ మీడియాలో పెట్టవద్దని, తప్పుడు, రెచ్చగొట్టే ఆరోపణలు, అలాగే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాలు అయిన వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రామ్, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకొని తప్పుడు, విద్వేషకర పోస్టులు చేసినా, షేర్ చేసినా తగిన చర్యలు తప్పవని అన్నారు. గొడవలకు సంబంధించి అన్ని వీడియోలు ఉన్నాయని, వాటి ఆధారంగా నిందితులను గుర్తించామని చెప్పాను. ఇట్టి గొడవలపై సమగ్ర విచారణ జరుగుతుందని, గొడవలకు కారణమైన ఎవరిని విడిచిపెట్టేది లేదని, ఎవరు కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, ఏమైనా అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని అన్నారు.




రోడ్డుపై ప్లకార్డులు పట్టుకుని అర్థనగ్న ప్రదర్శన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన

**చేర్యాల, జూన్ 18, ప్రభాతవార్త :** నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. మంగళవారం పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్‌రెడ్డి, దాసరి ప్రశాంత్‌లతో పాటు మండల విద్యార్థి నాయకులతో కలిసి రోడ్డుపై ప్లకార్డులు పట్టుకుని అర్ధనగ్న ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నీట లీకేజి పైన సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్‌టిఏను రద్దుచేసి నీట్ నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సుద్దాల భాస్కర్, తాడూరి భరత్, మధు, అజయ్‌రాజు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్స్‌కు ప్రతి నెల వేతనాలు చెల్లించాలి

**సిద్దిపేట రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:** అశ వర్కర్స్‌కు న్యాయం చేయడంతో పాటు ప్రతి నెల జాప్యం లేకుండా వేతనాలు చెల్లించాలని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ అశ వర్కర్స్‌కు నెల నెల జీతాలు సరిగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అశ వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. అశ వర్కర్లకు వెంటనే నెల నెల వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కట్ట భాగ్యలక్ష్మీ, సుమతి, కళావతి, కుంకుమ రాణి, నర్సమ్మ, నాగజ్యోతి, వినోద, మమత, సరిత తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ధర్నా

**ములుగు, జూన్ 18 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి ఆర్‌విఎం మెడికల్ కళాశాలలో ఇబ్బందులకు గురిచేస్తున్న అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తృతీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆర్‌విఎం కళాశాల గేట్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థుల పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తూ వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఆర్‌విఎం కళాశాల సీఈఓ శ్రీనివాసరావు అక్కడికి చేరుకొని విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించిన అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని, మరోసారి ఇలా జరుగకుండా చూస్తానని విద్యార్థులకు నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు.

# నిషేధిక ఆల్ఫాజోలం డ్రగ్ తయారీ కేంద్రంపై దాడులు

- రూ.1 కోటి విలువగల 2.6 కిలోల ఆల్ఫాజోలం, 30 కిలోల అల్ఫాజోలం తయారీ ముడి పదార్థాలు సీజ్
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



ఆల్ఫాజోలం డ్రగ్ తయారీ కేంద్రంలో పోలీసుల దాడుల దృశ్యం

**గుమ్మడిదల, జూన్ 18 ప్రభాతవార్త:** నిషేధిక ఆల్ఫాజోలం డ్రగ్ తయారీ కేంద్రంపై టీజీ న్యాబ్, సంగారెడ్డి పోలీసుల సంయుక్త దాడులు నిర్వహించారు. మంసుమారు రూ.1 కోటి విలువ గల 2.6 కిలోల ఆల్ఫాజోలం, 30 కిలోల అల్ఫాజోలం తయారీ ముడి పదార్థాలు సీజ్ చేశారు. మంగళవారం టీజీ న్యాబ్, సంగారెడ్డి జిల్లా పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో గల కొత్తపల్లి గ్రామ శివార్లలో సర్వేనెం.174/28లో నిషేధిక అల్ఫాజోలం తయారీ కేంద్రం నుంచి సుమారు కోటిరూపాయల విలువగల ఆల్ఫాజోలం, ఆల్ఫాజోలం తయారీ ముడి పదార్థాలు, అందుకు ఉపయోగించిన యంత్రాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ చెన్నూరి రమేష్ మాట్లాడుతూ నిందితులు గోసుకొండ అంజిరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, సాయికుమార్ గౌడ్ అనంతారం, గుమ్మడిదల మండలం, క్యాసారం రాకేష్ అనే నలుగురు వ్యక్తులు కలిసి అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో గల వ్యవసాయ భూమిని లీజుకు తీసుకొని అందులో కోళ్ల ఫారం నడుపుతూ అందులో గుట్టుచప్పుడు కాకుండా అంజిరెడ్డి బాలనగర్‌లో ఆల్ఫాజోలం తయారీకి కావలసిన ముడి పదార్థాలను కొనుక్కొని కెమిస్ట్ అయినటువంటి క్యాసారం రాకుష్ సహాయంతో ఆల్ఫాజోలం తయారు చేయగా, ప్రభాకర్‌గౌడ్ ఆల్ఫాజోలంను లోకల్ కల్లు దుకాణాలలో అమ్మి డబ్బులు సంపాదిస్తున్నారని వివరించారు. సుమారు 2.6 కిలోల ఆల్ఫాజోలం, సుమారు 20 కిలోల స్టేజ్-1, ఇంటర్మీడియట్ ఉత్పత్తి, సుమారు 10 కిలోల స్టేజ్-2 ఇంటర్మీడియట్ ఉత్పత్తి, 7 డ్రమ్ముల మిశ్రమ ద్రావణం, 1 బ్యాగ్ హెక్సామిథైల్ ఎనిటెటమైన్ (25 కిలోలు), 1 బ్యాగ్ హెక్సామిథైల్ ఎనిటెటమైన్ (10 కిలోలు), 2 డ్రమ్స్ ఎసిటిక్ యాసిడ్, 1 డ్రమ్ అమోనియం కార్బోనేట్, 2 డ్రమ్స్ ఫాస్పరస్ పెంటాసల్ఫైడ్ (90 కిలోలు), 2 చిన్న డ్రమ్ముల ఫాస్పరస్ పెంటాసల్ఫైడ్ (1/2 కిలో), ఫామ్ నూనె, ఈవోసీ రసాయనాలు, 1 కిలో రా మెటీరియల్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఆల్ఫాజోలం కలిపిన కల్లు స్లో పాయిజన్ వంటిదని, అనేక మంది యువకులు, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వివిధ రకాల నేరాలు చేయడం, ఇతర సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం జరుగుతుందన్నారు. ఈ డ్రగ్ మహమ్మారి మత్తులో అనేక మంది విద్యార్థులు తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, వారిని నమ్మిన అనేక కుటుంబాలు రోడ్డు పడుతున్నాయని, యువత, విద్యార్థులు డ్రగ్స్, గంజాయి బారిన పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఆల్ఫాజోలం అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యం అని, ఆల్ఫాజోలం తయారీలో బెంజిల్, సైనెడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలు ఉపయోగిస్తామన్నారు. ఆల్ఫాజోలం కలిపిన కల్లు తాగే వ్యక్తులు దానికి బానిసలై కిడ్నీ, కాలేయం, ఊరితిత్తుల సమస్యలతో తీవ్ర అనారోగ్యం పాలై చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. ఆల్ఫాజోలంవంటి మత్తుపదార్థాల తయారీ నిర్మూలనకై టీజీ న్యాబ్, జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సంవత్సర కాలం నుండి 5 అల్ఫాజోలం తయారీ కేంద్రాలను న్నారం, చర్లపల్లి, విజయవాడ, ఫసల్వాది, గుమ్మడిదలలలో గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలు పరిసర ప్రాంతాల్లో ఏదైనా అనుమానిత, రహస్య కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే జిల్లా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి, డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడంలో మీవంతు పాత్ర ఉండాలని ఎస్పీ రూపేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ సుధీర్ కుమార్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అనుమతి లేని చింతల్‌చెరువు ప్రైవేట్ ఆసుపత్రి సీజ్

## అనుమతి లేని ప్రైవేట్ ఆసుపత్రి సీజ్

**హత్నూరా, జూన్ 18 ప్రభాతవార్త:** హత్నూరా మండలం చింతల్ చెరువు గ్రామంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రిని రవీందర్ ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు జిల్లా వైదాన్యధికారి గాయాత్రీదేవి తెలిపారు. మంగళవారం గ్రామంలోని క్లినిక్‌కు సందర్శించగా ఎనిమిది బేడ్లు వేసి వైద్యం చేస్తున్నట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. డిస్‌పోజన్ చిరంజీలను వేడి చేసి వాడుతూ వాటితో నిడిల్ మాత్రమే మారుస్తూ ప్రజల ఆరోగ్యలతో ఆటలాడుకుంటున్నారని అధికారులు గుర్తించారు. అలాగే బయో మెడికల్ వేస్టూ మొత్తం సంచుల్లో నింపి అట్టి ముటాలను ఆసుపత్రి ఆవరణ మెట్లమీద ఉంచి రోగాల వ్యాప్తికి కారణమవుతున్నారని జిల్లా వైద్యాధికారి పేర్కొన్నారు. ఆసుపత్రికి అనుసందానం మెడికల్ షాపును నడుపుతూ అందులో పదవ తరగతి చదివిన అమ్మాయితో మందులు విక్రయాలు చేయడంతో గుర్తించినట్లు జిల్లా వైద్యాధికారి తెలిపారు. మెడికల్ షాపును కూడా సీజ్ చేసినట్లు వైద్యాధికారిణి గాయత్రీ దేవి తెలిపారు. జిల్లాలో ఎవరైన ఆర్‌ఎంపీ వైద్యులు తమ పరిధిలకు మించి బేడ్లు వేసి వైద్యం చేసిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**నీట్ పరీక్ష రద్దు చేయాలంటూ**

**ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం**



మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

**సిద్దిపేట రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:** వైద్య విద్యా ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష అక్రమాల పుట్టగా మారిన నేపథ్యంలో తక్షణమే పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం నీట్ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాని మోడీ దిష్టిబొమ్మను పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ దహనం చేశారు. ఈసందర్భంగా ఎన్ఎస్‌యుఐ నాయకులు మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు నిర్వహించే సంస్థను రద్దు చేయాలని ప్రధాని మోడీ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. నీట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండల్వడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షులు బడికోల్ రాకేష్ యాదవ్, నంగునూర్, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, మండలాల అధ్యక్షులు పిల్లి మహేష్, గ్యార రఘుపతి, వాసరి అజయ్, షాజిద్, మొగిలి రాకేష్, నరేష్, కన్నాయ పాల్గొన్నారు.

## 107 ఏళ్ల వృద్ధురాలు అనారోగ్యంతో మృతి

**గజ్వేల్ టౌన్, జూన్ 18 (ప్రభాతవార్త):** పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మైస నర్సమ్మ(107) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటలకు మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మైస నర్సమ్మ 107 సంవత్సరాల వయస్సులో కూడా తన పని తాను చేసుకుంటూ జీవించేదని తెలిపారు. నర్సమ్మ పెద్ద కుమారుడు మృతిచెందగా చంద్రయ్య, రాములు, స్వామి, కోడళ్ళు, మనవరాళ్ళు, మనవళ్ళు ఉన్నారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల బంధుమిత్రులతో కలిసి వేడుకను ఘనంగా నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**హుస్నాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హుస్నాబాద్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన చెన్నూరు సమ్మయ్య అనే వ్యక్తి సోమవారం రాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లి మంగళవారం ఉదయం హుస్నాబాద్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలోని ఒక మోతుకు చెట్టుకు ఉరేసుకుని శవమై కనిపించారు. బుడగజంగాలకు చెందిన సమ్మయ్యకు భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకూతురు వివాహం చేయగా చేసిన అప్పులు తీరకపోగా చిన్న కూతరు, కుమారుడికి రేచీకటి ఉందని అప్పుల బాదతో పాటు ఉన్న పిల్లల అనారోగ్యంపట్ల తీవ్ర మనస్థాపానికి గురైన సమ్మయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నారు.

## కూచనపల్లిలో వ్యక్తి దారుణ హత్య

**హుస్నాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కూచనపల్లిలో దారుణం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన గీకురు నర్సయ్య ఇంటి ముందు వరండాలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికిచంపినట్లు తెలుస్తోంది. రాత్రి రెండు గంటల సమయంలో నర్సయ్య భార్య శవంగా పడి ఉన్న భర్తను చూసి లబోదిబోమంటూ ఇంటిపక్కల వారికి సమాచారం అందించింది. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న ఎస్ఐ తోట మహేష్ క్లూస్ టీమ్ సిబ్బందితో కలసి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపిచి వివరాలు సేకరించడంతో పాటు కేసు నమోదు చేసుకుని దర్యప్తు ప్రారంభించారు. మృతునికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారని గ్రామంలో తనకు ఎవరితో శతృత్వం లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

**నర్సాపూర్ జూన్ 18. ప్రభాతవార్త :** కరెంటు షాక్‌తో కౌలురైతు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన యువ కౌలు రైతు గుండం మల్లేషం(38) పొలం వద్ద విద్యుత్ స్థంభంనుండి స్టాటర్ డబ్బాకు ఉన్న తీగెకు మరమ్మతులు చేస్తుండగా షాక్ తగిలి మృతి చెందాడు. మల్లేష్‌కు ఉన్న 10 గుంటలతో పాటు ఒక వ్యక్తి పొలాన్ని కౌలు చేస్తు కుటుంభాన్ని పోషించుకుంటున్నాడని తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు ఆడపిల్లలు అక్షయ (16) అక్షిత(14) అరుణ(12) ఉన్నారు. మలేష్ మృతితో ఆ కుటుంభం రోడ్డుపడింది. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. మల్లేష్ కుటుం బాన్ని ఆదుకోవాలని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, ఎంపిటీసీ గుర్రాల లక్ష్మిఅశోక్, తాజామాజీ సర్పంచ్ విజభాస్కర్‌రాజు ప్రభుత్వాన్ని కోరారు.

# టమాటా ధరలకు రెక్కలు

**-కిలో రూ.100లు దాటిన ధర -బీన్స్ రూ.150, క్యారెట్ రూ.80 -క్యాప్సికం రూ.100, పచ్చిమిర్చి రూ.120**

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త**

కూరగాయల ధరలు మండుతున్నాయి. వారం క్రితం టమాట రూ.40 పలికిన ధర..ఇప్పుడు ఏకంగా రూ.100లు దాటింది. పది రోజుల క్రితం వరకు నేల చూపులు చూసిన టమాట ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. అమాంతం పెరిగిన ధరలు కొండెక్కి కూర్చున్నాయి. దీంతో బోయిన్పల్లి మార్కెట్లో మదనపల్లి టమాట బాక్స్ కు రూ.1750లు పలుకుతోంది. మార్కెట్లో వీటి ధరల బోర్డును చూసిన జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇలా అయితే కూరగాయలు కొనేది ఎలా అంటూ వాపోతున్నారు. అసలే పన్నుల భారం, దీనికి తోడు కూరగాయలు, చికెన్ ధరలు కూడా వాతపెట్టడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. టమాటా డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర పెరిగిపోతోందని వ్యాపారులు చెబుతున్నారు. కొత్త పంట చేతికి రావడానికి మరో రెండు నెలలు పడుతుందని అప్పటి వరకు ధర పెంపు తప్పదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక వ్యాపారులు ఎక్కువగా చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని కొలార్, చిక్‌మంగళూర్‌లపై ఆధారపడి అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటారు. ఇటీవల టమాట ఎక్కువగా మహారాష్ట్ర నుంచి వస్తోంది. అయితే అక్కడ పంట సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఇక మన రాష్ట్రంలో పంట సాగు తక్కువగా ఉంది. అది కూడా మెదక్, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలో మాత్రమే టమాటా సాగవుతోంది. ఈ జిల్లాల నుంచి హైదరాబాద్ మార్కెటకు రోజుకు సుమారు 600-800 క్వింటాళ్ల మేర టమాట వస్తుంది. అయితే ఒక్క హైదరాబాద్ దినసరి టమాటా వినియోగం సగటున 5వేల క్వింటాళ్ల నుంచి 6వేల క్వింటాళ్లు ఉంటుంది. దీంతో డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర అమాంతం పెంచేశారు.

కొనబోతే కొరివి అన్నట్లుందని, ఎక్కడ చూసినా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రైతు బజార్లలో ఒకరేటు, బస్తీల, కాలనీలలో కూరగాయల మార్కెట్‌లలో మరోరేట్లు ఉంటున్నాయని ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు. రాజకీయ పార్టీలు ఎన్ని ఉన్నా ధరలు తగ్గిం చేందుకు ఏ ఒక్కరు కృషిచేసిన పాపాన పోలేదం టున్నారు. ఏంకొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు. కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ మోండా, మాదన్నపేట వంటి మార్కెట్‌లతో పాటు గ్రేటర్ పరిధిలోని 11 రైతు బజార్లకు రోజువా రీగా దిగుమతి కూరగాయల రాక తగ్గిపోయింది. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. నగర జనా భా ప్రకారం ప్రతి రోజు సుమారు మూడు వేల టన్నుల కూరగాయలు అవసరం. నగరానికి కూరగాయ దిగుమతి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ నుంచి దిగుమతి అవుతాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల దిగుబడి భారీగా తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం రూ.200లు పెడితే రెండు మూడు రకాల కూరగాయలను కూడా కొనలేని పరిస్థితి ఉంది. కొన్ని రకాలయితే రూ.30 వెచ్చించ నిదే పావుకిలో రావడం లేదు. బీన్స్ రూ.150, చిక్కుడు కాయ రూ.80, టమాట రూ.100, దొండకాయ రూ. 100లు, క్యారెట్ రూ.60లు, బెండకాయ రూ.80,పచ్చిమిర్చి రూ.120, కాకరకాయ రూ.80,ఆలుగడ్డ రూ. 40,క్యాప్సికామ్ రూ.90లు, బీరకాయ రూ.80 చొప్పున అమ్ముతున్నారు. మునగకాయ ఒక్కటి రూ.20లు చొప్పున, క్యాలిఫ్లవర్ రూ.60లు చొప్పున అమ్ము తున్నారు. ఆకు కూరల ధరలదీ అదే తీరు. రూ.10కి గతంలో మూడు నాలుగు కట్టలు ఇచ్చే కొత్తిమీర, పెద్ద కట్ట ఒకటి చొప్పున రూ.60లు, చిన్న రెండు కట్టలకు రూ.10లు చొప్పున అమ్ముతున్నారు.

పాలకూర కూడా అదే ధర పలుకుతున్నది. దీంతో చిన్న మెంతి, కరివేపాకు..ప్రస్తుతం ఒక్కటితో సరి పెడుతున్నారు. ఉల్లిగడ్డ రేట్లను చూ స్తే తాము తక్కువ కాదన్నట్లుగా రోజురోజుకు పెరుగుతోంది. కిలో రూ.50 నుంచి రూ.60 చొ ప్పున అమ్ముతున్నారు.

ఇక నాన్‌వెజ్ కూడా అదే విధంగా ఉంది. కిలో చికెన్ స్కిన్‌లెస్ రూ.300 లు చొప్పున అమ్మకాలు సాగుతున్నాయి.

# బ్రిటీష్ కాలంనాటి చట్టాలను రద్దు చేయాలి

**-విశ్వకర్మలను ఆదుకునేందుకు కొత్త చట్టం రూపొందించాలి**

**-తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మలు**



దీక్షకు మద్దతు తెలుపుతున్న జాజుల శ్రీనివాసగౌడ్

**ధర్నాచౌక్, జూన్ 18, ప్రభాతవార్త:**

బ్రిటీష్ కాలంనాటి చట్టాలను ఆసరా చేసుకుని విశ్వకర్మలను వేధించటం న్యాయం కాదని, కాలం చెల్లిన చట్టాలను రద్దు చేసి, విశ్వకర్మలను ఆదుకునేందుకు కొత్త చట్టం రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులు కొండోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో తెలంగాణ విశ్వకర్మల హక్కుల సాధనకై ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాసగౌడ్ మద్దతు తెలిపగా, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న స్వర్ణకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ దొంగ బంగారం కేసుల పేరుతో స్వర్ణకారుల వద్ద బంగారం వ్యాపారస్థుల వద్ద రికవరీలు చేయటం సరికాదని, దొంగతనం చేసిన వ్యక్తి ఆస్తులను అమ్మి రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మల సమస్యలు పరిష్కరించకుండా గత ప్రభుత్వం అన్యాయం చేసిందని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా విశ్వకర్మలకు చేయూతనిచ్చి, న్యాయం చేయాలని కోరారు. విశ్వకర్మల జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించి, కార్పోరేట్ జ్యూవెలర్స్ వల్ల కనుమరుగైన విశ్వకర్మ చేతి వృత్తి దారులను ప్రోత్సహించాలని అన్నారు. సెప్టెంబర్ 17న దేవశిల్పి విశ్వకర్మ భగవానుడి జయంతిని అధికారికంగా నిర్వహించి, ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రి స్పందిం చి, విశ్వకర్మల సమస్యలు పరిష్కరించాలని కోరా రు. ఈ దీక్షా కార్యక్రమంలో విశ్వకర్మ నాయకులు కుందారం గణేశాచారి, కన్నెకంటి సత్యం, శ్యాం ప్రసాద్, శ్యామల, సావిత్రి పాల్గొన్నారు.

## పరిశ్రమల యజమానులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**-ఎంఎస్ఎంఈ కమిషనర్ చంద్రశేఖర్**

**-నాచారంలో రుణమేళాకు మంచి స్పందన**



మాట్లాడుతున్న ఏడీసీ చంద్రశేకర్ తదితరులు

**నాచారం, జూన్ 18 ప్రభాతవార్త:** పరిశ్రమల యజమానులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలను కల్పించాలని మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) అడిషనల్ కమీషనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నాచారం ఇండస్ట్రీయల్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం పరిశ్రమలకు రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏడీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్యాంక్ రుణాలను సద్వినియోగపర్చుకొని తిరిగి బ్యాంకులకు చెల్లించాల్సిన భాధ్యతను తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలని సూచించారు. బ్యాంక్ వారు కూడా పరిశ్రమలు స్థాపించేవారిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి పరిశ్రమలతోనే సాధ్యమౌతుందన్నారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది పారిశ్రామిక వేత్తలు, పలువురు బ్యాంక్ ఏజీఎం,జీఎంలతో పాటు టీని అసోసియేషన్ అధ్యక్షులు జయరాజ్, ఉపాధ్యక్షులు రాజు, వర్కింగ్ ప్రసిడెంట్ నరేష్, కార్యదర్శి రాంమెహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ గౌడ్, నరేష్, మహేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మణికొండలో భారీ కొండ చిలువ


**- పరుగులు తీసిన స్థానికులు**

**నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మణికొండలో మంగళవారం 12.అడుగుల భారీ కొండ చిలువ స్థానికులను పరుగులు పెట్టించింది. తిరుమల హిల్స్ కాలనీలో కొండ చిలువను గమనించిన స్థానికులు ఒక్కసారిగా భయాందోళన చెందారు. ఫోన్‌లలో కొండ చిలువ ఫోటోలు, వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపులలో, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడ గుమిగూడి కొండ చిలువను దూరం నుంచి భయం భయంతోనే చూస్తుండిపోయారు. స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో కొంత సమయం తరువాత వారు సంఘటనా స్థలానికి వచ్చి చాకచక్యంగా కొండ చిలువను పట్టుకొని తమ బ్యాగులో వేసుకున్నారు. దాన్ని అటవీ ప్రాంతంలో వదిలి పెడ్తామని, పాములు మీ ప్రాంతాలలో కనిపిస్తే చంపవద్దని, మాకు సమాచారం ఇస్తే మేమే వాటిని పట్టుకొని వెళ్లి అడవుల్లో, జూపార్కులో వదిలి పెడ్తామని స్నేక్ క్యాచర్స్‌లు తెలిపారు. దీంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

## పాతబస్తీలో వివాహితపై యువకుడు హత్యాయత్నం

**చార్మినార్,జూన్ 18 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఓ యువతిని స్క్రూక్ డ్రైవర్‌తో గాయ పరిచి చంపటానికి ప్రయత్నించిన ఓ యువకుడిని ఛత్రినాక పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఛత్రినాక పోలీసుల కథనం ప్రకారం..వరంగల్ పాంతానికి చెందిన శ్రావ్య (24) పాతబస్తీ ఉప్పుగూడ ఎస్ఆర్‌టిటి కాలనీలో తల్లితో నివాసం ఉంటున్నది.శ్రావ్యకు 2019లో వ్యక్తితో ఓ వ్యక్తితో వివాహం జరిగింది.భర్తతో శ్రావ్యకు విభేదాలు రావటంతో కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నది.కాగా పాతబస్తీ చందూలాల్ బేలా ప్రాంతంలో నివాసం ఉంటున్న మణికంఠ (30) అబిడ్స్‌లో ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నాడు. చిన్న నాటి స్నేహితుడైన మణి కంఠ శ్రావ్యను పెళ్లి చేసుకుంటానని వేధించ సాగాడు.ప్రస్తుతం విడాకుల కేసు కోర్టులో ఉందని విడాకులు తర్వాత చూస్తా అని శ్రావ మణికంఠకు చెప్పింది.శ్రావ్యను ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడ వద్దని మణికంఠ హెచ్చరించాడు.శ్రావ్యపై మణికంఠకు అనుమానం పెరిగింది.మంగళవారం ఉదయం శ్రావ్య జిమ్ నుంచి ఇంటికి వచ్చింది.అదే సమయంలో శ్రావ్య వెనకాలే మణికంఠ వచ్చాడు.ఇంట్లోకి వెళ్లిన తర్వాత మణికంఠ శ్రావ్యతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగటంతో కోపంలో మణికంఠ శ్రావ్య ముఖంపై స్క్రూ డ్రైవర్‌తో దాడి చేశాడు.ఈ సంఘటనలో ఆమె గాయాల పాలైంది.గొంతు నులిపి చంప టానికి ప్రయత్నం చేయటంతో శ్రావ్య గట్టిగా అరవటంతో స్థానికులు వచ్చి అడ్డుకున్నారు.శ్రావ్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. మణికంఠను ఛత్రినాక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును ఛత్రినాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అంబర్ పేటలో అదుపు తప్పిన స్కూల్ వ్యాన్



**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:**

మంగళవారం అంబర్ పేట ప్రాంతంలో అదుపు తప్పిన స్కూల్ వ్యాన్ భీభత్సం సృష్టించింది. వేగంగా వస్తూ అదుపు తప్పి స్థానిక వెల్డింగ్ షాప్ వద్ద టీ దుకాణంలోకి దూసుకెళ్ళింది. దాంతో రెండు దుకాణాల్లోనూ సామగ్రి ధ్వంసమైంది. దీంతో ఆ ప్రాంతంలో కొంత సేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యాక్సిడెంటుకి కారణమైన స్కూల్ వ్యాన్‌ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు సంఘటన చూసిన స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మూడున్నర కేజీల గంజాయి పట్టివేత

**శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త**

దేవరయాంజాల్ గ్రామ పరిధిలో ఒరిస్సాకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయి (ఎండిన) మూడున్నర కిలోలను మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం శామీర్‌పేట మండలం తూం కుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామ పరిధిలో గంజాయిని ఎక్సైజ్ అధికారులు,సిబ్బంది నిఘా పెట్టి పట్టుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ సిఐ ఎం నవనీత కథనం ప్రకారం ఒడిస్సాకు చెందిన శంకర్ బాగ్ (28), సిబా కిల (24)లు దేవరయాంజాల్‌లో, మేడ్చల్‌లోని ఇంజనీరింగ్ కళాశాలల వద్ద గంజాయిని అమ్మకాలు జరపటానికి తెచ్చిన గంజాయిని డిప్యూటీ కమిషనర్ దశరథ ఆదేశాల మేరకు డిపిఇఒ ఫయూ జిద్దీన్, మేడ్చల్ ఎఇఎస్ మాదవయ్య వారి ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టి పట్టుకోవటం జరిగిందన్నారు. అయితే గంజాయిని అక్రమంగ సరఫరా చేస్తున్నట్లు, అమ్మకాలు జరుపుతున్నట్లు విశ్వసనీ య సమాచారం మేరకు దేవరయాంజాల్‌లో నిఘా పెట్టి ఆ ఇద్దరి నుంచి మూడున్నర కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సిఐ నవనీత పేర్కొన్నారు. వారి నుంచి ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు కూడ స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరు గంజాయిని దేవరయాంజాల్‌లో, మేడ్చల్ ఇంజనీరింగ్ కళాశాలల వద్ద అమ్మకాలు జరపటా నికి వారు తెచ్చినట్లు దీంతో వారు ఎక్సైజ్ అధికారులకు పట్టుబడినట్లు తెలిపారు. గంజాయి సేవించినా, అమ్మకాలు జరిపిన చట్టరీత్య నేరమని, అందుకు కఠిన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు. గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. సమాచారం అందజేయాల్సిన సెల్‌ఫోన్ నెంబర్లు 8712658740, 9182819684, 7093755115కు తెలియజేయాలని ఆమె వివరించారు.

# నిన్న థార్ గ్యాంగ్. నేడు భవారియా గ్యాంగ్

**-భాగ్యనగరంపై అంతర్రాష్ట్ర ముఠాల పంజా**

**-స్నాచింగులతో రెచ్చిపోయిన భవారియా గ్యాంగ్**

**-భద్రత పెరగడంతో పనివాళ్ళుగా, వికలాంగులుగా నటన**

**-రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందాలు**



**హైదరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:**

నగరంలోకి అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు చొరబడి కలకలం రేపుతున్న నేపథ్యంలో హైదరాబాద్ మరో బీహార్‌గా మారుతున్నదా? అనే అనుమానాలు రాక మానవు. ఓవైపు స్థానిక దొంగలు ఎక్కడికక్కడ ఇళ్ళను లూఠీ చేస్తుంటే, ఇతర రాష్ట్రాలకు చెందిన కిరాతక ముఠాల కథలికలు నగరంలో అలజడి రేపుతున్నాయి. ఒకేసారి వరుసగా ఇళ్ళలో చోరీలు చేసి అవసరమైతే దాడిచేసి ప్రాణాలు తీసేందుకు వెనుకాడని దోపిడీ దొంగల ముఠా సంచారం నగరవాసుల్లో ఆందోళన పెంచుతోంది. ఇటీవలె నగరంలోకి ప్రవేశించిన థార్ గ్యాంగ్ దొంగల ముఠా, నగర శివారులోని హయత్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల గేటెడ్ కమ్యూనిటీలోకి చొరబడి 5 ఇళ్ళలో చోరీలు చేసిన సంగతి తెలిసిందే. దొంగిలించిన సొమ్ము అధికమొత్తంలో లేకపోయినా, కిరాతకమైన హత్యలు, దోపిడీలు చేయడంలో ఆరితేరిన ముఠా ఇన్నేళ్ళ తరువాత హైదరాబాద్‌లోకి ప్రవేశించడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. ఇది జరిగి రెండు రోజులైనా కాక ముందే, ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా గ్యాంగ్ హైదరాబాద్‌పై మరోసారి గురిపెట్టింది. ఆదివాసీ తెగకు చెందిన భవారియా ముఠా గతంలో సృష్టించిన మారణకాండకి ఎన్నో ప్రాణాలు బలయ్యాయి. రెండేళ్ళ పాటు జైలు శిక్ష అనుభవించిన భవారియా ముఠా నాయకులలో కొందరు విడుదలయిన చాలా రోజులకు ముఠాతో సహా నగరంలోకి ప్రవేశించినట్లు సమాచారం. నగర శివారుల్లో మకాం వేసి, పదుల సంఖ్యలో ఉండే వీరి దొంగల ముఠా ఇద్దరిద్దరు బృందాలుగా విడిపోయి రోడ్డు మీద వెళ్తున్న మహిళలను టార్గెట్ చేశారు. ద్విచక్ర వాహనంపై దూసుకుపోతూ వరుస చైన్ స్నాచింగులకు పాల్పడి హైదరాబాద్‌ను బీహార్‌గా మార్చేశారు.

**రాచకొండ, సైబరాబాద్ పరిధుల్లో**

రాచకొండలోని జవహర్ నగర్ ప్రాంతంలో తొలుత రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న ఒక మహిళ మెడలోంచి గొలుసు తెంపుకుపోయిన భవారియా దొంగలు, శామీర్ పేటలోని, మెహిదీ పట్నంలోను రెప్ప పాటులో మరో రెండు గొలుసులను తెంచుకు పోయారు. శామీర్ పేట ప్రాంతానికి చెందిన గోనె రత్నమ్మ అనే మహిళ తన ఇంటి ముందు కూర్చొని మరో మహిళతో మాట్లాడుతుండగా, ద్విచక్ర వాహనంలో అక్కడకు వచ్చిన ఇద్దరు వ్యక్తులలో ఒకడు ఆమె వద్దకు వచ్చి చిరునామా అడిగినట్లు నాటకమాడి హఠాత్తుగా ఆమె మెడలోని పుస్తెల తాడు లాక్కుపోయాడు. అనంతరం అదే ప్రాంతంలో కూలి పని చేసి ఒంటరిగా తిరిగి వస్తున్న బుట్ట సత్యలక్ష్మి మెడలోంచి 3.5 తులాల పుస్తెల తాడు తెంచుకుని పరారయ్యారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకోవడానికి నిఘా పటిష్టం చేశారు. నగర శివారు ప్రాంతాల్లో రాత్రుళ్ళు పెట్రోలింగ్ పెంచారు. రాత్రుళ్ళు ఒంటరిగా బయటకు వెళ్ళే సామాన్యులు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించారు.

**భద్రత పెరగడంతో పనివాళ్ళుగా చేరతారు**

ఈ రెండు గ్యాంగులూ ప్రధానంగా నగర శివారు ప్రాంతాలు, దూరంగా విసిరేసినట్లుండే కాలనీల్లోని ఇళ్ళల్లో దొంగతనాలు చేస్తుంటారు. అటువంటిది నగరంలో ప్రవేశించిన అనంతరం భవారియా దొంగల ముఠా వరుస చైన్ స్నాచింగులకు పాల్పడడం, మరోపక్క థార్ గ్యాంగ్ ఇళ్ళలో చోరీలు చేయడంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్యాంగులూ వేరు వేరు అయినప్పటికీ దొంగతనం చేసే పద్ధతులు ఒకే రకంగా ఉండడంతో పోలీసులు భవారియా గ్యాంగ్ పాత కేసులు తవ్వి తీస్తున్నారు. గతంలో వీరు కూడా నగర శివారుల్లోని ఇళ్ళల్లో గుంపుగా చొరబడి దోపిడీ చేసే క్రమంలో రక్త పాతం సృష్టించిన దాఖలాలను హైదరాబాద్ వాసులు ఎప్పటికీ మరిచిపోలేరు. దాంతో కమీషనరేట్‌లలోని పోలీసు బృందాలు రంగంలోకి దిగారు. నగర శివారు ప్రాంతాల్లోని వివిధ కాలనీల్లో భద్రతా సిబ్బంది నియామకం, సీసీ కెమేరాలు, పోలీసుల పెట్రోలింగ్ పెంచడం వంటి చర్యల వల్ల కొన్ని దొంగల ముఠాలు కొత్త పంథాలో తమ పనితనాన్ని చూపిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంటి పని, ఇతర అవసరాల పేరుతో పట్టపగలు ఇళ్ళలోకి ప్రవేశించి దోపిడీలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. కొందరు వికలాంగులుగా నటిస్తూ మభ్యపెట్టి దాడులకు, చోరీలకు తెగబడుతున్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండమని నగర పోలీసులు సూచిస్తున్నారు. ఇంట్లో కొత్తగా పనిలోకి చేర్చుకునేవారి పట్ల మరింత జాగ్రత్తగా ఉండమని హెచ్చరిస్తున్నారు.

# అంతరాష్ట్ర డ్రగ్ ముఠా అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి...

**-26గ్రాముల డ్రగ్‌తో పాటు 4సెల్‌ఫోన్లు స్వాధీనం..**

**నేరెడ్‌మెట్ జూన్18 ప్రభాతవార్త:**

సులభంగా డబ్బు సంపాదించాలనే నెపంతో డ్రగ్స్‌కు అలవాటు అక్రమంగా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ముఠా సభ్యులను ఎల్బీనగర్ పోలీసులు, వనస్థలిపురం, భువనగిరి పోలీసుల సహాయంతో అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి పేర్కొన్నారు. మంగళవారం నేరెడ్‌మెట వాయుపురిలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన అత్తపురం భరత్‌రెడ్డి (21) విద్యార్థి, వనస్థలిపురం, ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన చిక్యాల విక్యాత్ (19), హయత్‌నగర్ పవనగిరి ప్రాంతానికి చెందిన హేమంత్ కుమార్‌లు విద్యార్థులు. అత్తపురం భరత్‌రెడ్డి, చిక్యాల విక్యాత్‌లు ఇద్దరు స్నేహితులు చెడు వ్యసనాల బారిన పడి సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో మాదక ద్రవ్యాలను విక్రయించడానికి నిర్ణయించుకున్నారు. బెంగళూరు నుండి నగరానికి తక్కువ ధరకు ఎండిఎంఏ డ్రగ్స్‌ను విక్రయించి నగరంలో అమ్మేవారు. రూ. 1200 గ్రాముకు ఎండిఎంఏ మాదక ద్రవ్యాన్ని విక్రయించి నగరంలో రూ. 4వేల నుండి 5వేల మధ్యలో అమ్మేవారన్నారు. ఈ నెల 17వ తేదీనా విశ్వసనీయన సమాచారం అందుకున్న పోలీసులు అత్తపురం భరత్‌రెడ్డి, చిక్యాల విక్యాత్‌తో పాటు మాదకద్రవ్యం తీసుకుంటున్న హేమంత్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి 26గ్రాముల మాదకద్రవ్యంతో పాటు, 4సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

**భువనగిరి రూరల్ పోలిస్టేషన్ పరిధిలో..**

అక్రమంగా గంజాను సరఫరా చేస్తున్న ముగ్గురు ముఠా సభ్యులను భువనగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. వివరాల ప్రకారం హైదరాబాద్ బోరబండ ప్రాంతానికి చెందిన పెరుసమాల దినేష్ (28), కార్ మెకానిక్, అదే ప్రాంతానికి చెందిన అమ్రతుల్లారి హోనెస్ట్ (29) కార్పెంటర్, తాళ్ళపల్లి భరణి (26) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు వీరందరు స్నేహితులు గంజాకు అలవాటు పడ్డ వీరు ఆంధ్రప్రదేశ్‌లోని నర్సిపట్నం, విశాఖపట్నం నుండి హాష్ ఆయిల్, ఇతర డ్రగ్స్‌ను కొనుగోలు చేసి నగరంలో విక్రయించే వారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ పోలీసులు అనాజిపురం చౌరస్తా వద్ద తనఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉండడంతో వారిని పట్టుకొని విచారించగా వివరాలు తెలిపారు. ఈ మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2లీటర్ల హార్స్ ఆయిల్, 03 సెల్‌ఫోన్లు, కారుతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఫేక్ గోల్డ్ బిస్కెట్లు అమ్ముతున్న ముఠా అరెస్టు..

**-మూడు కార్లు, రూ.6కోట్ల 86లక్షల ఫేక్ కరెన్సీతో పాటు 5కిలోల నకిలీ బంగారు బిస్కెట్ల స్వాధీనం..**




నిందితుల వద్ద నుండి సేకరించిన నకిలీ బంగారు బిస్కెట్ల వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి..

**నేరెడ్‌మెట్ జూన్18 ప్రభాతవార్త:**

నకిలీ బంగారు బిస్కెట్లను అమ్ముతున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులను రాచకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి పేర్కొన్నారు. మంగళవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నెల్లూరు కావలికి చెందిన కారెడ్డుల విజయ్‌కుమార్ (39)వ్యాపారం చేస్తుంటాడు. గుంటూరు తెనాలికి చెందిన నంబూరి డేవిడ్ లివింగ్ స్టోన్ (52) వ్యాపారం, బోగిరి సునీల్ గవస్కర్ (27) డ్రైవర్, అడిగోపుల ఓం సాయి కిరిటే(26) డ్రైవర్‌గా పని చేస్తుంటారు. వీరందరు నకిలీ బంగారు బిస్కెట్లను మార్కెట్ కన్నా తక్కువ రేటుకు ఇస్తామని పలువురిని నమ్మబలికి మొదట్లో తక్కువ రేటుకు నిజమైన బంగారాన్ని ఇచ్చి నమ్మకం వచ్చే విధంగా వ్యవహరిస్తారు. అనంతరం పెద్దమొత్తంలో బంగారం కావాలని కొనుగోలుదారుల నుండి ఆర్డర్ రాగానే నకిలా బంగారానికి పూత పూసి వారికకి అంటగడుతారు. అనంతరం వారి వద్ద నుండి బంగారం తీసుకున్న తరువాత సుడో పోలీసులను పోలీసుల వలే స్పాట్‌కు తీసుకువచ్చి వారిని భయపెట్టే విధంగా చేస్తూ వారి వద్ద నుండి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసేవారన్నారు. ఈ క్రమంలో మేడిపల్లికి చెందిన దిలీప్ బర్బా అనే వ్యక్తి నిందితుల వద్ద మోసపోయి మేడపిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుండి మూడు కార్లు, ఒక పోలీస్ యూనిఫాం, 6కోట్ల 86లక్షల నకిలీ కరెన్సీ, 5కిలోల ఫేక్ గోల్డ్ బిస్కెట్లు, 51లక్షల నగదును స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి, మల్కాజిగిరి డీసిపి పద్మజ, ఏసిపి మల్కాజిగిరి చక్రపాణి, మేడిపల్లి ఎస్‌హెచ్ఓ గోవింద్ రెడ్డి, ఎస్సై నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపి సురేశ్‌శెట్కార్‌ను ఆశీర్వదిస్తున్న అవదూతగిర మహారాజ్

## ఘనంగా శ్రీదత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవం

### -ఎంపి సురేశ్‌శెట్కార్‌కు పూర్ణకుంభంతో స్వాగతం

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 18, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపాలిటి పరిధిలోని శ్రీదత్తాత్రేయ మందిర వార్షికోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్దలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమాలకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేశ్‌కుమార్ శెట్కార్ హాజరు కాగా ఆలయ కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎంపి సురేశ్ కుమార్ శెట్కార్, కాంగ్రెస్ యువ నాయకులు సాగర్‌శెట్కార్, హనుమడ్లు శేట్, కాశీనాథ్‌పాటిల్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, బిఎస్ వీర్‌శెట్టి, బసిరెడ్డి, శివకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, ఝరాసంగం మండలం బర్దీపూర్‌లోని శ్రీదత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు) సురేశ్‌శెట్కార్‌కు ఆశీర్వచనాలుచేసి తీర్థప్రసాదాలు అందించారు.

## బిజెపి జిల్లా కార్యదర్శిగా నరేందర్‌రెడ్డి



నరేందర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందచేస్తున్న గోదావరి అంజిరెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 18, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా నరేందర్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సి గోదావరిఅంజిరెడ్డి నియామకపత్రాన్ని మంగళవారం అందచేశారు. నియామక పత్రం అందుకున్న నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డికి, అందుకు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతకి పెద్దల సూచలన మేరకు కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి హామి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటి కౌన్సిలర్ శంషాబాద్ రాజు, నాయకులు నరసింహారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకులను బే షరతుగా విడుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న బిజెపి నేతలు

**పాపన్నపేట, జూన్ 18, ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలో అక్రమంగా అరెస్టు చేసిన భారతీయ జనతా పార్టీ నాయకులను భేషరతుగా వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ విజయ లక్ష్మికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మెదక్‌లో జరిగిన సంఘటనలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌ను జైలు నుంచి బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. గడ్డం శ్రీనివాస్‌ను భేషరుతగా వెంటనే విడుదల చేయాలని పార్టీ మండల ప్రధానకార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు బొక్కల భాగేష్, ఓబిసి ప్రధాన కార్యదర్శి వడ్ల భాగేష్, పట్టణ అధ్యక్షులు సుంకరి కిష్టయ్య, నాయకులు చంద్రశేఖర్, ఏసు, లక్ష్మణ్, దుర్గయ్య, మల్లేశం, విఠల్, వెంకట్, శ్రవణ్ పాల్గొన్నారు.

## రామాయంపేటలో 'రైతు నేస్తం'



వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న అధికారులు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 18, ప్రభాతవార్త :** రామాయంపేట రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. వర్షాకాలం సీజన్లో వరిపంట సాగు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

### -ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 18, ప్రభాతవార్త:** అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాల పనుల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే రెండు మాసాల్లో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని సూచించారు. నూతన భవనాలు పూర్తయితే విద్యార్థులకు ఆధునిక వసంతులతో కూడిన భవనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్ యాదవ్, పరమేష్ యాదవ్, ఐలేష్, మండల విద్యాధికారి పిపి రాథోడ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, పంచాయితీ డీఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# విజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకుల విమర్శలు సరికావు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 18, ప్రభాతవార్త :**

భారతీయ జనతా పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలు సరికావని, వారి అభ్యంతరకర ఖండిస్తున్నామని ఆ పార్టీ నేత జంగంపల్లి శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక బిజెపి నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మొన్నటి మెదక్ సంఘటనలో గోమాతలను బక్రీద్ సందర్భంగా తరలిస్తుంటే హిందువులు అడ్డుకున్న క్రమంలో హిందూ, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణ సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు బిజెపిపైన, మెదక్ నియోజకవర్గ ఇంచార్జి పంజా విజయ్‌కుమార్‌పైన చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు సరికావన్నారు. కాంగ్రెస్ నాయకులు కేవలం మైనార్టీల మెప్పుకోసమే ప్రెస్‌మీట్‌లు పెట్టారన్నారు. ప్రెస్‌మీట్‌లోనూ గోవుల గురించి, హిందువులపైన జరిగిన రాళ్ల దాడి, కత్తిపోటు, లాఠీచార్జి, అక్రమ అరెస్టులు గురించి, హిందువులగురించి ప్రస్తావించలేదని ఆరోపించారు. గత ఎంపి ఎన్నికల్లో నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేసి బిజెపికి అధిక ఓట్లు వచ్చేందుకు కృషి చేశారని, అది దృష్టిలో పెట్టుకొని బిజెపిని బలహీన పరిచేందుకే కాంగ్రెస్ పార్టీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గోమాతను హిందువులు తల్లిగా పవిత్రంగా భావిస్తారని, అటువంటి ఆవులను బక్రీద్ పండుగ పేరుతో చంపుతుంటే హిందూ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఒకపక్క సుప్రీంకోర్టులో గోసంరక్షణ చట్టం ఉన్నా, వాటిని అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు పోలీసులు విఫలం అయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారం ఉంది కదా అని విచక్షణ లేకుండా మాట్లాడుతున్నారని, బిజెపిని, నాయకులను విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులకులేదని అన్నారు. సమావేశంలో నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్, వొలిసె దామోదర్‌రావు, ఎల్లంగౌడ్, కొడపర్తి నరేందర్, మేకల లావణ్య, భరత్‌కుమార్, కటికె కార్తిక్, బండి గిరి, నాంపల్లి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

## ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, జూన్ 18, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం ఘనాపూర్ గ్రామంలో గల రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిధిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ తల్లి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కాశిరెడ్డి, విట్టల్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బోధన సిబ్బంది దరఖాస్తులకు ఆహ్వానం

**చిన్నశంకరంపేట, జూన్ 18, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో తెలుగు, హిందీ, గణితంలో బోధించడానికి అతిధి అధ్యాపకుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపధ్యాయురాలు శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు నేటి ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాఠశాలకు రావాలని ఆమె తెలిపారు.

## వర్గల్ పిహెచ్‌సిలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ హరిత


**వర్గల్, జూన్ 18 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవంకు సంబంధించి మండల స్థాయి అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి జాలిగామ లత రమేష్‌గౌడ్, జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్‌లు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు, చిన్నారులకు నులిపురుగుల నివారణకు గానూ మాత్రలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి సత్యనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరిత, డాక్టర్ శిరీష, సిహెచ్‌ఓ వెంకటేశ్వరమ్మ, సూపర్వైజర్స్, ఆశా వర్కర్స్, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## 20న తహసీల్దార్ కార్యాయంలో ఇసుక వేలం

**చేర్యాల, జూన్ 18, ప్రభాతవార్త :** అక్రమంగా పట్టుబడ్డ ఇసుకను ఈనెల 20న చేర్యాల తహశీల్దారు కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఆర్ఐ రాజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది రోజుల క్రితం ఎలాంటి అనుమతులులేకుండా ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న ఇసుకను స్వాధీనం చేసుకుని తహశీల్దారు కార్యాలయంలో నిల్వఉంచిన సుమారు 10ట్రిప్పుల ఇసుకను వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. కావల్సిన వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

## ఎంపి రఘునందనరావును కలిసిన బిజెపి నాయకులు

**రాయపోల్ జూన్ 18 ప్రభాతవార్త :** మెదక్ ఎంపీగా మాధవనేని రఘునందన్‌రావు గెలుపొందడంతో ఆయనను మంగళవారం రాయపోల్ మండల బిజెపి ఉపాధ్యక్షులు నరేష్‌గౌడ్, సినియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల్లో రఘునందన్‌రావు మెదక్ ఎంపీగా గెలుపొందడంతో ఆయనను మార్యదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నీల చంద్రం తదితరులు పాల్గొన్నారు



ఎంపీ రఘునందనరావుతో బిజెపి నాయకులు



పదోన్నతిపై విచ్చేసిన జిహెచ్‌ఎంలను సన్మానిస్తున్న పిఆర్‌టియు నేలు

## పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

**జహీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** ఇటీవల పదోన్నతిపై విచ్చేసిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఘనంగా సన్మానించారు. చిరాగ్‌పల్లి, మల్చల్మా, అసద్‌గంజ్, మొగుడంపల్లి, ధనసిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రేణుకదేవి, అనిత, తుల్జాబాయి వెంకటేశం, రమేష్‌లను పిఆర్‌టియునాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ జహీరాబాద్ అధ్యక్షులు తులసిరామ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మొగుడంపల్లి మండల శాఖ అధ్యక్షులు చంద్రు రాథోడ్, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ప్రదీప్‌కుమార్, నాయకులు ఎన్ ఆనంద్, రమేష్, నర్సిములు, జైపాల్‌రెడ్డి, జైపాల్, విజయ్ కుమార్, నాగరాజ్, జహీరాబాద్ ఎంఈఓ బస్వరాజ్, ప్రధానోపాధ్యాయులు జాఫర్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్ర వేడుకలు

**వర్గల్, జూన్ 18 (ప్రభాతవార్త):** మండలంలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం స్వామివారి సన్నిధిలో స్వాతి నక్షత్ర హోమంను వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ నేతృత్వంలో ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి జన్మ నక్షత్రంను పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లుచేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లి గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్



మహేష్‌గౌడ్‌కు నియమకపత్రం అందజేస్తున్న దృశ్యం

**రాయపోల్ జూన్ 18 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తపల్లి గౌడ సంఘం గ్రామ అధ్యక్షులుగా చుంచనకోట మహేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చుంచనకోట కృష్ణగౌడ్, డైరెక్టర్లుగా బాగాగౌడ్, నరేష్‌గౌడ్, నర్సింలుగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా గౌడ కులస్థుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఆనంతరం మహేష్‌గౌడ్‌ను గ్రామ గౌడ కులస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామ గౌడ కులస్థులు మంతూరి యాదగిరిగౌడ్, చుంచనకోట నాగుల్‌గౌడ్, చుంచనకోట ఆంజనేయులుగౌడ్, నర్సింలుగౌడ్, రాజాగౌడ్, మల్లేశంగౌడ్, రాములుగౌడ్, యాదగిరిగౌడ్, స్వామిగౌడ్, ముత్యాలుగౌడ్, నాగుల్‌గౌడ్, సాయిగౌడ్, కృష్ణాగౌడ్, వర్ధిగౌడ్, ప్రసాద్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

**రామచంద్రాపురం, జూన్ 18, ప్రభాతవార్త:** రామచంద్రాపురం రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తి (35-40 సంవత్సరాలు) మృతి చెందినట్లు రామచంద్రాపురం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం...లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో విదులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఈ నెల 17వ తారీఖు రాత్రి రామచంద్రాపురం రైల్వే స్టేషన్ పార్కింగ్ ఏరియాలో వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించి ఆర్‌పిఎఫ్ ఎస్‌కి సమాచారం అందించారన్నారు. 5.5 అడుగుల ఎత్తు గల మృతుడి శరీరంపై ఆకుపచ్చ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. వ్యక్తి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చున్నారు. గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే రామచంద్రాపురం పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని ఎస్‌ఐ వివరించారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

**ములుగు, జూన్ 18 (ప్రభాతవార్త):**

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, అంటువ్యాధులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య క్షేమ సమాచారాలను తెలుసుకోవడంతో పాటు ఫార్మసీ స్టోర్‌కు వెళ్ళి మందుల పంపిణీ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషిత నీటిని త్రాగడం వల్ల వచ్చే డయేరియా, రక్త విరోచనాలు, కామెర్లు, దోమల వల్ల సంక్రమించే మలేరియా, చికున్ గన్యా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ల్యాబ్‌లో సేకరించిన పరీక్షల నమూనాలను టి-హబ్ పంపించాలని, వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి ఆన్‌లైన్ ఎంట్రీస్‌ని ఎప్పటికప్పుడు హెచ్‌ఐఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు ఆదేశించారు. ఐపి, ఓపి కేసుల సంఖ్య పెంచాలని, గర్భిణీల నమోదు, ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రసవం అనంతరం తల్లి బిడ్డల సంక్షేమ చర్యలను చేపట్టాలని తెలిపారు. మానసిక రుగ్మతలకు సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించేందుకు టెలిమానస్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు.



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

వారివెంట డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ అఖిల, సిబ్బంది ఉన్నారు.

## 20న మండల సర్వసభ్య సమావేశం

**మనూర్, జూన్ 18, ప్రభాతవార్త:** ఈ నెల 20వ తేదీన ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ అలివేలు మంగ తెలిపారు. 20వ తారీఖు మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అయ్యే సమావేశానికి మండల సభ్యులు, ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఎంపిడిఓ అలివేలు మంగ సూచించారు.

## 22న ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్‌లు

**రామచంద్రాపురం, జూన్ 18, ప్రభాతవార్త:** ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరానికిగాను వెలిమెలలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఈ నెల 22న స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.రాంప్రసాద్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అయ్యే స్పాట్ అడ్మిషన్‌కు ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ టీసీ, ఎస్‌ఎస్‌సి హాల్‌టికెట్, ఫలితాల షీట్, ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని, విద్యార్థులు ఆయా పత్రాలతో స్పాట్ అడ్మిషన్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్‌లను ప్రారంభించే ముందుగా ఆయా గ్రూపులలోని ఖాళీల వివరాలు వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ ఏ రాంప్రసాద్ తెలిపారు.

## ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసిన ఏడీఏ

**కంగ్టి, జూన్ 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆయా ఫర్టిలైజర్ దుకాణాలను నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ తనిఖీ చేశారు. మంగళవారం కంగ్టిలోని దుకాణంలో విత్తనాలు రసాయన ఎరువులు స్టాక్ వివరాలు తనిఖీ చేశారు. నిల్వలను రికార్డు బుక్‌లో పొందుపర్చాలన్నారు. రైతులకు పత్తి విత్తనాలు సరిపోయే విధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు విత్తిన విత్తనాలను చూసుకోవాలని చెప్పారు. దుకాణదారులు సరైన ధరలకు మందులు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెలే

**నిజాంపేట(ఖేడ్), జూన్ 18 ప్రభాతవార్త:** నిజాంపేట మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు వడ్ల వెంకన్న భార్యకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. మంగళవారం విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, పార్టీ మండల అధ్యక్షులు పరమేష్, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి సురేష్‌శెట్కార్‌కు సన్మానం



ఎంపి సురేష్‌శెట్కార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి

**నారాయణఖేడ్, జూన్ 18 ప్రభాతవార్త:** జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్‌కు గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి గొంగడితో ఘనంగా సన్మానించారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎంపీ సురేష్‌శెట్కార్ నివాస గృహంలో గొంగడితో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీగా రెండుసార్లు భారీ మెజార్టీతో గెలుపొందారు. కార్యక్రమంలో డాక్టరు ప్రసాద్, ఓంప్రకాష్, నరేష్‌యాదవ్, పెద్ద సాయిలు, దత్తుగొండ, బాబన్న, భూంగొండ, నగేష్, విఠల్, భూంగొండ పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

**కల్హేర్, జూన్ 18 ప్రభాతవార్త:** మండలపరిధిలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన సామేల్ ఇటీవల ప్రమాదవశాత్తులో మృతి చెందాడు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పార్టీ సభ్యత్వం ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.2 లక్షల పార్టీ సభ్యత్వ చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఇన్సూరెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు రామ్ సింగ్, మాజీ మండల అధ్యక్షులు నారాయణరావు, మాజీ ఆత్మచైర్మన్ దిలీప్ కుమార్, నాయకులు సాయిగొండ, కృష్ణగౌడ్, జైపాల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## ఎంపి శెట్కార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నేతలు

**నాగల్‌గిద్ద, జూన్ 18, ప్రభాతవార్త:** జహీరాబాద్ ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్‌ను మండలంలోని కరస్‌గుత్తి కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎంపి సురేశ్ శెట్కార్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సోపన్‌రావు పాటిల్, రమేష్‌రావుపాటిల్, చంద్రశేఖర్, బాలాజీరావుపాటిల్ ఉన్నారు.



ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**జహీరాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం... ఈ నెల 17న పట్టణ శివారులోని ఎడ్ల బజార్ వెనకాల హైమద్‌నగర్ కాలనీ రైల్వే ట్రాక్ పక్కన చెట్ల పొదల్లో కానుగ చెట్టుకు లుంగీతో ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి(45-50 సంవత్సరాలు) ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టటానికి వీలులేకుండా ఉందన్నారు. నీలి, తెల్లని గీతల రంగు లుంగీ, పసుపు పచ్చ తెల్లని డబ్బాలు గల టవల్, వైట్ షర్ట్, నల్లని అండర్ వేర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. తల వెంట్రుకలు తెలుపు, నలుపురంగులో ఉన్నాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే జహీరాబాద్ పట్టణ పోలీసు ఠాణాను సంప్రదించాలని, 8712656763ని సంప్రదించాలని ఎస్‌ఐ లక్ష్మారెడ్డి వివరించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**వెల్దుర్తి, జూన్ 18 ప్రభాతవార్త:** విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని బండ పోచాన్‌పల్లి శివారులో జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం బండపోచాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు గుండు ప్రభాకర్(40) వ్యవసాయ పొలానికి విద్యుత్ సరఫరా కాకపోవడంతో తోటి రైతులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా, ఆ క్రమంలోనే 11 కేవీ విద్యుత్ వైరు తెగి మీద పడటంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవతాగౌడ్ తెలిపారు. మృతుడికి భార్య శ్యామలతోపాటు కుమారుడు, కూతురు ఉన్నారు.